క్లుప్తంగా

ఎమ్మెల్సీతో భేటీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని రామ్‌జీ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తామని ఆయన తెలిపారు.

ఘన సన్మానం



నెల్లూరు(అర్బన్): అంధుల జీవితాల్లో వెలుగులు ప్రసాదించే పుణ్యకార్యం నేత్రదానమని డీఎంహెచ్‌ఓ సుజాత పేర్కొన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల ముగింపును పురస్కరించుకొని సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో నేత్రదాన మోటివేటర్లకు సోమవారం నిర్వహించిన అభినందన సభలో ఆమె మాట్లాడారు. ఇలాంటి పుణ్యకార్యాన్ని ప్రోత్సహిస్తున్న స్వచ్ఛంద సంస్థలు, మోటివేటర్లకు అభినందనలు తెలిపారు. అనంతరం మోటివేటర్లు సుబ్బారావు, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, చిరంజీవి ఐ బ్యాంక్ సుధీర్, వాసవీ క్లబ్ నుంచి బయ్యా ప్రసాద్, మనసేవా సంస్థ నుంచి దేవళ్ల శ్రీనివాసులు, అభయం ఆర్గనైజేషన్ నుంచి శ్రీవాణి, హేమలత తదితరులను జిల్లా అంధత్వ నివారణాధికారి శర్వాణి ఆధ్వర్యంలో సత్కరించారు. ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

అధిక మోతాదులో యూరియాను వాడొద్దు

ఇందుకూరుపేట: వరి సాగులో అధిక మోతాదులో యూరియా వినియోగం తగదని మండల వ్యవసాయాధికారి రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఇందుకూరుపేటలో సోమవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

⇨ **కోవూరు:** అధిక మోతాదులో ఎరువులను వినియోగిస్తే సంభవించే అనర్థాలపై అవగాహన సదస్సును ఇనమడుగులో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ ఉప సంచాలకులు అనిత మాట్లాడారు. వ్యవసాయాధికారి రజని, సర్పంచ్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

⇨ **కొడవలూరు:** యూరియా వినియోగంపై రైతులకు అవగాహన అవసరమని వ్యవసాయాధికారి విజయలక్ష్మి పేర్కొన్నారు. ఎరువుల వినియోగంపై ఆలూరుపాడులో రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన ర్యాలీని నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు బద్వేలు వినీల్‌రెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ ఎదుట నిరసన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వాహనమిత్ర పథకాన్ని అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి మల్లికార్జునరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఎదుట నిరసనను సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ పథకాన్ని వెంటనే అమలు చేసి, లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో కార్మికుడికి రూ.25 వేలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నేత రాధయ్య, ఆటో కార్మిక సంఘ నేతలు మాల్యాద్రి, సునీల్, రాహుల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతతోనే దేశాభివృద్ధి



విడవలూరు: సంపూర్ణ అక్షరాస్యతతోనే దేశాభివృద్ధి సాధ్యమని వయోజన విద్య జిల్లా నోడల్ అధికారి మల్లు మస్తాన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంలో ఆయన మాట్లాడారు. కోవూరు నియోజకవర్గంలోని 21 వేల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్ది.. వచ్చే ఏడాది మార్చి నాటికి సంపూర్ణ అక్షరాస్యత కోవూరుగా ప్రకటించేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. అనంతరం విద్యార్థులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీని నిర్వహించి మానవహారాన్ని ఏర్పాటు చేశారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ ప్రకృతి ఉత్పత్తులను సోమవారం ప్రదర్శించారు.




కర్ర సాయంతో తిరుగుతూ..



పింఛన్ సమస్యపై కలెక్టరేట్‌కు వచ్చిన దివ్యాంగురాలు

మెట్లెక్కడం చాలా కష్టంగా ఉంది





అర్జీలిచ్చేందుకొచ్చి..

కష్టాలు తీర్చేదెవరు..?

కన్నీళ్లు తుడిచేదెవరు..?

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో గ్రామ, వార్డు సచివాయాల్లోనే అనేక సమస్యలు పరిష్కారమయ్యేవి. అయితే కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితే లేదు. కలెక్టరేట్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే బాధితుల సంఖ్య పెరుగుతోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వృద్ధులు, దివ్యాంగులు అష్టకష్టాలు పడుతూ వస్తున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు తగిన చర్యలు చేపడితే ఇలా తిరిగే అవసరమే ఉండదు. కానీ అలా జరగడం లేదు. ఇదిలా ఉండగా కొందరు వృద్ధులకు సహాయకులు సైతం ఉండటం లేదు. ఇలాంటి వారి కోసం సిబ్బందిని ఏర్పాటు చేస్తే బాగుంటుందనే అభిప్రాయం వినిపిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

ప్రభుత్వాస్పత్రిలో అన్నదానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ప్రభుత్వాస్పత్రిలో గల సత్యసేవా ట్రస్ట్‌లో రోగుల సహాయకులకు అన్నదానాన్ని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యుడు అహ్మద్ హుస్సేన్ సోమవారం నిర్వహించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ చింతల అమరేంద్రరెడ్డి, సెక్రటరీ పొన్నం రవిచంద్ర, నేతలు స్వర్ణ రమేష్‌బాబు, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన మారథాన్ నేడు

నెల్లూరు(అర్బన్): హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఐదు కిలోమీటర్ల మారథాన్‌ను మంగళవారం నిర్వహించనున్నామని జిల్లా ఎయిడ్స్ నివారణాధికారి ఖాదర్‌వలీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వద్ద ఉదయం ఆరు గంటలకు ప్రారంభంకానుందని, 17 నుంచి 25 ఏళ్లలోపు విద్యార్థులకు మగ, ఆడ, ట్రాన్స్‌జెండర్ విభాగాల్లో వేర్వేరుగా పరుగు పందేన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. విజేతలకు అన్ని విభాగాల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులుగా రూ.పది వేలు, రూ.ఏడు వేలను అందజేయనున్నామని వివరించారు. విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికకానున్నారని చెప్పారు.

ఘనంగా అక్షరాస్యత దినోత్సవం



నెల్లూరు (టౌన్): మూలాపేటలోని వేద సంస్కృత పాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ప్రజాసత్తా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శోభన్ బాబు, రాష్ట్ర కన్వీనర్ దయాకర్, ముస్లిం సత్తా జిల్లా మహిళాధ్యక్షులు షబానా, హెచ్‌ఎం శర్మ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు సిటీ: జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. ఈ సందర్భంగా వీరికి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

'అన్నదాత పోరు' పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మంగళవారం నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను చింతారెడ్డిపాళెంలోని తన నివాసంలో పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కలెక్టర్‌ను కలిసిన ఏపీఆర్ఎస్ఏ నేతలు



నెల్లూరు(అర్బన్): ఏపీఆర్ఎస్ఏ జిల్లా కమిటీకి ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు.. కలెక్టర్ ఆనంద్‌ను కలెక్టరేట్లో మర్యాదపూర్వకంగా సోమవారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అల్లంపాటి పెంచలరెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల్ని ఆదుకోవాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న నేతలు

నెల్లూరు రూరల్: జిల్లాలో ఎడగారు ధాన్యం మార్కెట్లోకి వస్తోందని, మద్దతు ధర కల్పించి అన్నదాతలను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు షానవాజ్, ప్రధాన కార్యదర్శి గంగపట్నం రమణయ్య డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట నిరసనను సోమవారం తెలిపిన అనంతరం వారు మాట్లాడారు. దళారులు, మిల్లర్లు కుమ్మక్కై పుట్టిని రూ.16 వేలకు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి వ్యాపారులొచ్చి రూ.16700 కు కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. మన ధాన్యానికి ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ ఉందని, సివిల్ సప్లయ్స్ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

ఆటో కార్మికులకు న్యాయం చేయాలి



జేసీతో మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు రూరల్: ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సురేష్ కోరారు. కలెక్టరేట్లో జేసీ కార్తీక్‌కు వినతిపత్రాన్ని సోమవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి డ్రైవర్‌కు ఏడాదికి రూ.20 వేల చొప్పున ఇవ్వాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అవినీతికి నిలయంగా మారిన ఏటీసీ సెంటర్‌ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నేతు రాజు, సుధాకర్, రవీంద్ర, పెంచలయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అద్దె చెల్లించని మున్సిపల్ దుకాణాల సీజ్



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థకు అద్దె చెల్లించని పలు మున్సిపల్ దుకాణాలను రెవెన్యూ అధికారులు సోమవారం సీజ్ చేశారు. కార్పొరేషన్‌కు చెందిన సొదాగర్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపు నంబర్ 11 – రూ.75 వేలు, పప్పులవీధిలోని షాపు నంబర్ 18 – రూ.60,333, షాపు 22 – రూ. 2,21,052, షాపు 24 – రూ.13 లక్షలను చెల్లించాల్సి ఉంది. నోటీసులను పలుమార్లు జారీ చేసినా ప్రయోజనం లేకపోవడంతో కమిషనర్ నందన్ ఆదేశాల మేరకు షాపులను సీజ్ చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సచివాలయ వార్డు అడ్మిన్ కార్యదర్శులు జాషువా, మురళి, శేఖర్, వాసంతి తదితరులు పాల్గొన్నారు.

13, 14న 'వీఆర్' పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నెల్లూరు(బృందావనం): వీఆర్ కళాశాలలో 1976 – 79 మధ్య చదివిన బీఎస్సీ పూర్వ విద్యార్థుల, కుటుంబసభ్యుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నామని రవీంద్రరెడ్డి, నాగరాజారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెంచలకోనకు ఈ నెల 13న విహారయాత్ర.., పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో సమావేశాన్ని 14న నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

నేత్రదానం



సర్టిఫికెట్‌ను అందజేస్తున్న సునీల్

నెల్లూరు(అర్బన్): అక్కచెరువుపాడులోని టిడ్కో సముదాయానికి చెందిన బైరవరపు కోటేశ్వరరావు (45) నగరంలోని సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఈ క్రమంలో హనుమకొండ సునీత, రాము, రెడ్‌క్రాస్ ఎమ్సీ మెంబర్ శ్రీవాణి, వాసవీ వనిత లెజెండ్ ప్రెసిడెంట్ దుగ్గిశెట్టి హేమలత సహకారంతో నేత్రాలను ప్రభుత్వాస్పత్రికి మృతుడి సోదరుడు వెంకటశ్రీనివాసరావు దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99595 89321, 9912470094 నంబర్లను సంప్రదించాలని సునీల్ కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నెల్లూరు(వీఆర్సీ సెంటర్): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డు దాటుతున్న వ్యక్తి మృతి చెందారు. నెల్లూరు నార్త్ ట్రాఫిక్ పోలీసుల వివరాల మేరకు.. జాతీయ రహదారిపై ప్రశాంతినగర్ కూడలి వద్ద గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొంది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడి మృతి చెందారు. ప్రశాంతినగర్ నాలుగో వార్డు వీఆర్వో సమాచారం మేరకు ఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. రోడ్లపై చిత్తు కాగితాలు, వాటర్ బాటిళ్లను ఏరుకొని జీవనం సాగించేవాడనే విషయం తెలిసింది. మృతుడు నీలి రంగు నిక్కర్, లుంగీని ధరించి ఉన్నారు. 40 నుంచి 45 ఏళ్లలోపు ఉండొచ్చని భావిస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణలను అడ్డుకోండి



అర్జీలను స్వీకరిస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి, నిర్మాణాలను జరపకుండా నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా అర్జీలను స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు తదితరాలను తొలగిస్తామని స్పష్టం చేశారు. జూబ్లీ హాస్పిటల్ రోడ్డు, కొండాయపాళెం గేట్, రామలింగాపురం ప్రధాన డ్రెయిన్ కాలువలపై ఉన్న నిర్మాణాలను తొలగిస్తున్నామని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా సొంత గృహాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొత్తం 45 అర్జీలు అందాయని ఆయన చెప్పారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజినీరింగ్ విభాగ ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఎంహెచ్‌ఓ కనకాద్రి, సిటీ ప్లానర్ హిమబిందు, టౌన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వాసుబాబు, మేనేజర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

⇨ నగరపాలక సంస్థ పరిధిలోని మినరల్ వాటర్ ప్లాంట్లను సంబంధిత అధికారులు తనిఖీ చేయాలని 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు కమిషనర్ నందన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. పెంచలనాయుడు, రామాంజనేయరెడ్డి, రఘుపతినాయుడు, కృష్ణారెడ్డి, దినేష్‌రెడ్డి, సురేంద్ర, రమణారెడ్డి, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

⇨ నగరంలోని 53, 54వ డివిజన్లలో ప్రభుత్వ బ్యాంక్ శాఖను ఏర్పాటు చేయాలని సీపీఎం నగర కమిటీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నగర కార్యదర్శివర్గ సభ్యుడు నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు మూలం ప్రసాద్, కత్తి పద్మ, జాఫర్, శాఖ కార్యదర్శి గద్దం శ్రీనివాసులురెడ్డి, నేతలు షకీలా, భార్గవి, లక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

⇨ అనుమతుల్లేకుండా రోడ్ల వెంబడి అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా అందిన ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు గానూ 37వ డివిజన్లోని రామ్‌నగర్ రెండో వీధిలో ఆయన పర్యటించారు. ఎంజీబీ మాల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో చేపట్టిన కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను పర్యవేక్షించారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలో రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన షాపులను పరిశీలించారు. అనుమతుల్లేకుండా ఏర్పాటు చేయకూడదని, వెంటనే తొలగించాలని సూచించారు.

12న చలో కలెక్టరేట్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో చలో కలెక్టరేట్‌ను ఈ నెల 12న నిర్వహించనున్నామని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను నగరంలోని వీఆర్సీ సెంటర్‌లో సోమవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యారంగంపై అనేక హామీలను ప్రస్తుతం మంత్రి లోకేశ్ నాడు గుప్పించారని, అయితే దేన్నీ అమలు చేయలేదని ఆరోపించారు. నేతలు షారూఖ్, ఆశీర్వాదం, చరణ్, సాయి, తాహీర్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ



నెల్లూరు(అర్బన్): నేత్రదానాన్ని కుటుంబ సంప్రదాయంగా ప్రతి ఒక్కరూ మార్చుకోవాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి, ప్రభుత్వ పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ మాధవి పేర్కొన్నారు. నేత్రదాన పక్షోత్సవాల ముగింపును పురస్కరించుకొని నేత్రదానంపై అవగాహన ర్యాలీని నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల నుంచి కంటి విభాగ హెచ్‌ఓడీ వసంత ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. అనంతరం నేత్రదానంపై అవగాహన కల్పించారు. మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ మస్తాన్‌బాషా, బెన్హర్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి కళారాణి, ప్రొఫెసర్ వసంత తదితరులు పాల్గొన్నారు.

కాపు భవన్‌లో చోరీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి ఆలయ సమీపంలో గల కాపు భవన్‌లో ఏసీలను పగలగొట్టి అందులో ఉన్న రాగి వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. చిన్నబజార్ పోలీసుల వివరాల మేరకు.. కాపు భవన్‌కు అటెండర్ సర్దార్ సోమవారం వచ్చి లోపలికెళ్లారు. ఈ తరుణంలో ఐదు ఏసీలను పగలగొట్టి అందులోని రాగి వైర్లు, ఎనిమిది సీలింగ్ ఫ్యాన్లు, విద్యుత్ వైర్లు చోరీకి గురైన అంశాన్ని గుర్తించారు. వీటి విలువ రూ.రెండు లక్షల వరకు ఉంటుంది. బీసీ కార్పొరేషన్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసును పోలీసులు నమోదు చేశారు.

రౌడీషీటర్ అరెస్ట్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): లాడ్జి యజమానిని కత్తితో బెదిరించి రూ.రెండు వేలను లాక్కున్న రౌడీషీటర్‌ను చిన్నబజార్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. చిన్నబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ లాడ్జిని ఉమ్మారెడ్డిగుంటకు చెందిన పెనుబల్లి భాస్కర్‌రెడ్డి నిర్వహిస్తున్నారు. ఇక్కడికి రౌడీషీటర్ ముంగమూరు సాయితేజారెడ్డి అలియాస్ బుల్లెట్ సాయి తరచూ వస్తూ, గదిని అద్దెకు తీసుకొని గొడవ పెట్టుకొని డబ్బులివ్వకుండా వెళ్లేవారు. తాజాగా శనివారం మరోసారి వచ్చి గదిని అద్దెకు తీసుకొని, ఆదివారం ఉదయం ఖాళీ చేసి వెళ్లే సమయంలో రిసెప్షన్ కౌంటర్‌లో ఉన్న భాస్కర్‌రెడ్డిను డబ్బులివ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై ఆయన ప్రశ్నించగా, ఇవ్వకపోతే చంపేస్తానంటూ కత్తితో బెదిరించారు. దీంతో ఆయన డబ్బులిచ్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడ్ని అరెస్ట్ చేశారు.